సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



దొంగ నోట్ల ముఠా అరెస్ట్

దొంగ నోట్ల ముఠా సభ్యులు ఐదుగురిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర విలేకరులకు వెల్లడించారు.

8లో ▸



ఇంకా ముంపులోనే..

ఆకివీడు సమతానగర్‌లోని వీరమల్లు కాలనీ వరదతో నీటమునగ్గా.. ముంపు వీడకుండానే బాధితులను పునరావాస కేంద్రం నుంచి ఇళ్లకు వెళ్లమన్నారు.

8లో ▸



భగ్గుమన్న కూటమి కుంపటి

నరసాపురం పట్టణంలో అన్న క్యాంటీన్ల ప్రారంభ కార్యక్రమం వేదికగా కూటమి నేతల మధ్య ఆధిపత్య విభేదాలు భగ్గుమన్నాయి.

8లో ▸



వాగ్దానాలు మరిచి.. వంచనతో పాలించి..



అంతన్నారు.. ఇంతన్నారు.. ఇంకేముంది.. అధికారంలోకి రావడమే తరువాయి..
అవి చేస్తాం.. ఇవి చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు జిల్లాలో హామీల వరద పారించారు. గోదావరిపై వంతెనలు కట్టేస్తాం.. విజ్జేశ్వరం నుంచి ఇంటింటికీ రక్షిత నీరు ఇచ్చేస్తాం.. తణుకులో హైటెక్ టవర్.. భీమవరంలో డంపింగ్ యార్డు.. పాలకొల్లులో టిడ్కో ఫ్లాట్ల పంపిణీ.. ఆకివీడులో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం.. ఆక్వా రంగానికి సబ్సిడీపై రూపాయిన్నరకే యూనిట్ విద్యుత్.. ఇలా ఒకటేమిటి ఎడాపెడా వాగ్దానాలతో ఊదరగొట్టారు.. పాలనా పగ్గాలు చేపట్టి నేటికి వంద రోజులు పూర్తవుతున్నా హామీల అమలుకు ఒక్క అడుగు కూడా పడలేదు. – సాక్షి/భీమవరం

హామీల అమలెప్పుడు బాబూ..!

- జిల్లాకు హామీల వర్షం కురిపించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్
- విజ్జేశ్వరం నుంచి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు
- మత్స్యకార భృతి రూ.20 వేలు చేస్తామని హామీ
- శ్రావణ మాసంలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలు
- వశిష్ట వారధిపై వంతెన నిర్మాణం
- తణుకులో హైటెక్ టవర్, పరిశ్రమల ఏర్పాటు వంటి వాగ్దానాలు
- ఎన్నికల హామీల్లో ఒక్క అడుగు కూడా పడని వైనం
- కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన అధ్వానం

మత్స్యకార భృతి.. మాటెత్తరే..

ఏప్రిల్ 5న..

నరసాపురం, పాలకొల్లులో ప్రజాగళం సభల్లో పాల్గొన్న చంద్రబాబు నరసాపురం నియోజకవర్గంలో అత్యధిక జనాభాగా ఉన్న మత్స్యకార సామాజికవర్గాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచుతామన్నారు. అయితే ఈ ఏడాది మత్స్యకార భృతి ఇంతవరకూ అందించనే లేదు. గత టీడీపీ హయాంలో రూ.4,000గా ఉన్న మత్స్యకార భృతిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10,000లకు పెంచారు. ఐదేళ్ల పాటు ఏటా మే నెలలోనే ఒక్కో మత్స్యకారునికి వైఎస్సార్ మత్స్యకార భరోసాను అందిస్తూ వచ్చారు. టీడీపీ హయాంలో జిల్లాలో కేవలం 76 మందికి ఈ లబ్ధి చేకూరితే జగన్ హయాంలో 1,162 మందికి పైగా లబ్ధి చేకూర్చడం విశేషం.

టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారో..

ఏప్రిల్ 5న..

పాలకొల్లు సభలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్రావణ మాసంలో జిల్లాలో టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలు చేయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉచిత ఇసుక ఇస్తామన్నారు. జిల్లాలోని రోడ్లన్నింటినీ బాగుచేస్తామన్నారు. వీటిలో ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు. ఉచిత ఇసుక మాటున రవాణా, సీనరేజీ చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఐదు యూనిట్ల లారీకి రూ.3 వేల నుంచి రూ.4 వేల అదనపు వ్యయమవుతోందని వినియోగదారులు వాపోతున్నారు.

ఉపాధి.. ఊసేది

ఏప్రిల్ 10న..

తణుకులోని నరేంద్ర సెంటర్ వద్ద బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తణుకులో హైటెక్ టవర్ నిర్మిస్తామన్నారు. ఇంటి వద్ద నుంచే ఉద్యోగాలు చేసుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లేక ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారన్నారు. తణుకును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని, వలసలు అరికడతామని వాగ్దానం చేశారు. ఆయన డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టి వంద రోజులైనా ఆ దిశగా ఇంకా అడుగులు ఏమీ పడలేదు.



పాలకొల్లు, నరసాపురం ప్రజాగళం సభలపై ఎల్లో మీడియాలో వచ్చిన కథనం

'నీటి' మీద రాతలుగానే..

ఏప్రిల్ 21న.. నరసాపురం, భీమవరం ప్రచారంలో పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. నరసాపురంలో మాట్లాడుతూ వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణాన్ని జగన్ సర్కార్ చేపట్టలేకపోయిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. భీమవరంలో ప్రసంగిస్తూ పట్టణానికి ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. వీరవాసరం మండలం, భీమవరం మండలాల్లోని శివారు గ్రామాలకు తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇవేమీ కార్యరూపం దాల్చలేదు. వాస్తవానికి గత ప్రభుత్వంలోనే వశిష్ట వారధిపై వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచారు. శివకోడు నుంచి 216 జాతీయ రహదారికి అనుబంధంగా బైపాస్ నిర్మించేలా మధ్యలో రాజుల్లంక వద్ద రూ.565 కోట్లతో వంతెన నిర్మించేలా నాటి సీఎం జగన్ కేంద్రాన్ని ఒప్పించి వంతెన నిర్మాణానికి ఒక రూపు తెచ్చారు. ఈలోపు ఎన్నికలు రావడంతో ఈ అంశం మరుగున పడింది.

గూడెం.. అభివృద్ధికి దూరం

ఏప్రిల్ 29న..

తాడేపల్లిగూడెం వారాహి సభలో పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. హైవే పక్కనే ఉండటం వలన ఇక్కడ రవాణా రంగం బాగా అభివృద్ధి చెందిందని, తాడేపల్లిగూడెంను మార్కెట్ హబ్‌గా, ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రీన్ టాక్స్ తగ్గిస్తామన్నారు. మిలట్రీ మాధవరం–తాడేపల్లిగూడెం ఎయిర్‌పోర్టు భూములను అన్యాక్రాంతం నుంచి కాపాడతామన్నారు. మిలట్రీ ఉద్యోగుల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇవేమీ చేయకపోగా ఎలక్ట్రిక్ వాహనాలపై కొత్తగా 12 శాతం పన్ను విధించారు.



తణుకు సభలో చంద్రబాబు ప్రసంగంపై ఎల్లో మీడియాలో వచ్చిన కథనం

ఆక్వాకు ఆదరువు కరువు

మే 10న..

ఉండి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పాల్గొన్నారు. నియోజకవర్గంలో భూగర్భ జలాలు కాలుష్యం బారిన పడ్డాయి కాబట్టి విజ్జేశ్వరం నుంచి ప్రాజెక్టెడ్ వాటర్ స్కీమ్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని ఇంటింటికీ కుళాయిల ద్వారా ఇస్తానన్నారు. యూనిట్ రూ.1.50కే ఇచ్చి ఆక్వా రంగాన్ని పైకి తీసుకువస్తానన్నారు. అవసరమైన చోట్ల 500 టన్నులు కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజీలు కట్టిస్తానన్నారు. ఏరియేటర్స్ మీద సబ్సిడీ ఇప్పిస్తానన్నారు. ఆకివీడులో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేసి క్లీన్ ఆకివీడుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆకివీడులో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి లేదా ఫ్లైఓవర్ నిర్మిస్తామని హామీలు గుప్పించారు. వంద రోజుల్లో వీటి అమలు దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

కలగానే వారధి

జనవరిలో

ఆచంటలో జరిగిన టీడీపీ రా కదలిరా సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఆచంట మండలం అయోధ్యలంక-కోడేరు మధ్య గోదావరిపై వారధి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయోధ్యలంకలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోక మరుగున పడిపోయాయి.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణకు కృషి



సైకిల్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ

భీమవరం: పర్యావరణంతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని పర్యావరణహిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం విష్ణు కళాశాల వద్ద నుంచి సేవా కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైకిల్ ర్యాలీలో ఆమె మాట్లాడారు. ర్యాలీలో కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), కనుమూరి రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సైకిల్ వాడకం వలన వాహనాల కాలుష్య నియంత్రణతో పాటు దేహదారుఢ్యానికి ఉపయోగపడుతుందన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వాతావరణానికి విద్యార్థులు, యువత కృషిచేయాలన్నారు. సైకిల్ ర్యాలీ విష్ణు కళాశాల మెయిన్ గేట్ నుంచి బీవీ రాజు సర్కిల్ వరకు సాగింది. అడిషనల్ ఎస్పీ వి. భీమారావు, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నోడల్ అధికారి బీవీ నాగేశ్వరరావు, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, విష్ణు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్స్ డీఐజీగా మాధవి



ఎస్.మాధవి, డీఐజీ



కె.శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఏలూరు రేంజ్ డీఐజీగా ఎస్.మాధవి, జిల్లా రిజిస్ట్రార్‌గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. గత నెలలో డీఐజీ కె.అబ్రహం పదవీ విరమణ చేయగా అప్పటినుంచి కాకినాడ డీఐజీ ఎ.నాగలక్ష్మి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం డీఐజీ ఎస్.మాధవిని ఏలూరు డీఐజీగా నియమించారు. చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావును ఇక్కడ రిజిస్ట్రార్‌గా నియమించారు. వీరు శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

శ్రీవారి దేవస్థానం ఈఓగా మూర్తి



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన ఈఓగా ఎన్‌వీఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర దేవదాయ శాఖలోని పలు ప్రముఖ ఆలయాల ఈఓలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆర్‌జేసీగా విధులు నిర్వర్తించిన ఎన్‌వీఎస్ఎన్ మూర్తిని ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేస్తూ, ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న వేండ్ర త్రినాథరావును సింహాచలం ఈఓగా నియమించారు. అలాగే ఇప్పటివరకు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్‌జేసీగా నియమించారు.

బీఎస్ఎన్ఎల్ వైఫై రోమింగ్ సేవ

ఏలూరు (టూటౌన్): బీఎస్ఎన్ఎల్ వైఫై రోమింగ్ సేవ అన్ని ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులకు ప్రారంభిస్తున్నట్టు టెలికాం జిల్లా జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సేవ ద్వారా ఇంట్లో రోమింగ్ సమయంలో నిరంతర ఇంటర్నెట్ సేవలను అందించడంలో సహకరిస్తుందన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వినియోగదారులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్రంపాడు విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఫెస్ట్ ఏపీ 2024 రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో సత్రంపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. 9వ తరగతి చదువుతున్న పి.శ్రగ్విత, 8వ తరగతి చదువుతున్న ఈ.కీర్తన సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావును, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతి చెక్కును అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, ఉపాధ్యాయులు వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి పాలనలో బాలికలకు రక్షణ కరువు

- నిందితుడు శశికుమార్‌ను కఠినంగా శిక్షించాలి
- బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్



ఏలూరులో ఎస్పీకి వినతిపత్రం అందించేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, సమన్వయకర్తలు మామిళ్లపల్లి జయప్రకాష్, కంభం విజయరాజు, నాయకులు



జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, సమన్వయకర్తలు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం బాలికల వసతి గృహంలో బాలికలపై శశికుమార్ అనే వ్యక్తి అకృత్యాలపై వైఎస్సార్‌సీపీ నేతలు స్పందించారు. ప్రభుత్వం వెంటనే నిందితుడిని అరెస్ట్ చేయాలనీ, అతనికి సహకరించిన వారిపైనా కేసులు నమోదు చేసి త్వరితగతిన కఠిన శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏలూరులో ఆందోళన చేశారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు, పార్టీ నేతలు కలిసి తొలుత ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందించారు.

సభ్యసమాజం తలదించుకునేలా..

వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. బాలికలపై అకృత్యాలకు పాల్పడుతున్న శశికుమార్‌ను అరెస్ట్ చేయాలనీ, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత హేయమైన రీతిలో బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న నిందితుడు శశికుమార్‌కు పడే శిక్షతో సమాజంలో ఇలాంటి వ్యక్తులు భయపడేలా చేయాలన్నారు. పేద కుటుంబాలకు చెందిన బాలికలు చదువుకునేందుకు హాస్టల్‌లో చేరితే ఇలాంటి అమానుష ఘటనల జరిగితే ఇక వారి పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. ప్రభుత్వం శశికుమార్ లాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించేందుకు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని పోలీస్ అధికారులను కోరారు. సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసిన వ్యవహారంపై రాజకీయంగా కొందరు బాధితులను భయపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోందనీ, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో పేద మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందనీ, ప్రజలు తీవ్ర అభద్రతా భావంతో ఉన్నారని ఆయన విమర్శించారు.

ఇదేనా వంద రోజుల పాలన

వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు మాట్లాడుతూ.. ఏలూరు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అధికారులంతా ఉంటారనీ, అలాంటి నగరంలో అనుమతులు లేకుండా ఆశ్రమం పేరుతో బాలికల హాస్టల్‌ను ఎలా నడుపుతున్నారో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు శశికుమార్, వార్డెన్ ఫణిశ్రీతోపాటు బాలికలను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తులకు కఠిన శిక్షలు విధించేలా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థినులపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయనీ, ప్రజలు తమ పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడుతున్నారని విమర్శించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, పార్టీ నేతలు గ్లెవియర్ మాస్టార్, లిగల్‌సెల్ నాయకులు ప్రత్తిపాటి తంబి, జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు, ఎస్సీ సెల్ నాయకులు తోటకూర కిషోర్, మట్టా రాజు, బండ్లమూడి సునీల్‌కుమార్, పసుపులేటి శేషు, జయరామ్‌రెడ్డి, యల్లాపు మోజెస్, తులసి, సుభాష్, రెడ్డి జనార్దన్, రాజేశ్వరరావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

డ్వాక్రా యానిమేటర్‌కు భరోసా



యానిమేటర్ వరలక్ష్మిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ

సాక్షి స్పందన

భీమవరం అర్బన్: 'సాక్షి'లో గురువారం 'డ్వాక్రా యానిమేటర్ ఆత్మహత్యాయత్నం' శీర్షికన ప్రచురించిన కథనంపై డ్వాక్రా మహిళా సంఘాల యూనియన్ స్పందించింది. ఆత్మహత్యకు యత్నించిన యానిమేటర్ తోట వరలక్ష్మిని డ్వాక్రా మహిళా సంఘాల జిల్లా అధ్యక్షురాలు నాగిడి గోవిందమ్మ పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చినఅమిరం గ్రామంలో డ్వాక్రా సంఘాలపై కూటమి నాయకుల పెత్తనంపై పలువురు ఆమెకు వివరించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ మాట్లాడుతూ ఈ విషయాన్ని రాష్ట్ర డ్వాక్రా సంఘాల నాయకుల దృష్టికి తీసుకువెళతామన్నారు. గోవిందమ్మతో పాటు 60 మంది యానిమేటర్లు బాధితురాలు వరలక్ష్మికి అండగా నిలిచారు.

వరద బాధితులకు అందని సాయం

నూజివీడు: నూజివీడులోని పలు ప్రాంతాల్లో గత నెల 31న వరద ముంపునకు గురైన కుటుంబాలకు ఇప్పటికీ సాయం అందలేదు. స్థానిక 10వ వార్డు పరిధిలోని మొఘల్ చెరువు లోపలి భాగంలో 50 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లలోకి వరద నీరు రాగా రెవెన్యూ సిబ్బంది 13 మందిని మాత్రమే అర్హులుగా చేర్చారు. వీరికి ఈనెల 18న బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బియ్యం, పంచదార రాగా వాటిని పంపిణీ చేయకుండా వార్డు సచివాలయంలోనే ఉంచడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఆర్డీఓ ఉన్నా తమ బాధలు పట్టించుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతానికి కౌన్సిలర్ మీర్ అంజాద్ ఆలీ సచివాలయానికి వెళ్లి వరద బాధితులకు సాయం అందించమని అడిగినా సిబ్బంది స్పందించడం లేదు. వరద ముంపునకు గురై 20 రోజులవుతున్నా సరుకులు ఇవ్వకపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సచివాలయంలోనే ఉన్న బియ్యం బస్తాలు

స్వర్ణాంధ్ర లక్ష్యంతో ప్రణాళికలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్వర్ణాంధ్ర–2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలుకు కృషి చేయాలని చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్‌ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, అధికారులు హాజరయ్యారు. అలాగే ఉచిత ఇసుక విధానంపై ఆన్‌లైన్ పోర్టల్‌ను సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించగా కలెక్టరేట్ నుంచి వర్చ్యువల్‌గా వీక్షించారు.

5 నుంచి ఇస్రో వైజ్ఞానిక పండుగ

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థి దశ నుంచే వైజ్ఞానిక విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో శ్రీహరికోట ఇస్రో కార్యాలయ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా రాష్ట్రంలో భీమవరం పట్టణాన్ని ఎంపిక చేసి అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలుపుతూ కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 4 నుంచి 10 వరకు వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిసాలోని పది ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. రాష్ట్రంలో భీమవరం పట్టణాన్ని ఎంపిక చేశారన్నారు. 5న స్పేస్ వాక్‌తో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 6న స్పేస్ క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు, ఇస్రో ఎగ్జిబిషన్, వీడియో స్క్రీనింగ్ కార్యక్రమాల ఏర్పాటు చేస్తామన్నారు. 7న తుది పోటీలు జరుగుతాయన్నారు. ఇస్రో కార్యక్రమాలను పాఠశాల, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షార్ క్వాలిటీ కంట్రోల్ జనరల్ మేనేజర్ పి.ఏడుకొండలు, హెడ్ ఆఫ్ సివిల్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎంవీఎల్ సతీష్, ఆకెళ్ల శేష సాయి ఉన్నారు.

క్లుప్తంగా

మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

కుక్కునూరు: అక్రమ మద్యాన్ని కలిగి ఉన్న వ్యక్తిని గురువారం పోలీసులు తీసుకొని కేసు నమోదు చేశారు. కుక్కునూరు మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన వడ్డే రాములు తెలంగాణకు చెందిన 37 క్వార్టర్ బాటిల్‌ను అక్రమంగా ఇంట్లో దాచి ఉంచాడన్న సమాచారం మేరకు దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామక్రిష్ణ చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

మొగల్తూరు: పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యమైందని ఎస్సై జి వాసు తెలిపారు. వివరాల ప్రకారం.. భీమవరం పట్టణంలోని మెంటేవారి తోటకు చెందిన గంధం ప్రవీణ్ కుమార్, గంధం ప్రభు కిరణ్, బబ్లు, ఎన్ లోకేష్, వి బాబు, కె శివసాయి అనే ఆరుగురు వ్యక్తులు బుధవారం మధ్యాహ్నం బీచ్‌కు వచ్చారు. తీరంలో సరదాగా గడిపిన అనంతరం స్నానానికి దిగారు. అలలు ఉధృతంగా రావడంతో ప్రవీణ్ కుమార్ (17) గల్లంతయ్యాడు. గల్లంతైన యువకుని మృతదేహం గురువారం ఉదయం మోళ్ళపర్రు బీచ్ ప్రాంతంలో తీరానికి కొట్టుకు వచ్చింది. మృతుని తండ్రి గంధం మార్రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసు చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తణుకు: యువతి అదృశ్యంపై తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన యజ్జల విజయదుర్గ ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై దీంతో తల్లి యజ్జల మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

బాణసంచా నిల్వ చేసిన వ్యక్తి అరెస్ట్


బాణసంచాను స్వాధీనం చేసుకున్న ఎస్సై శుభశేఖర్

ఆగిరిపల్లి: అక్రమంగా బాణసంచా నిల్వచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ఆదేశాలతో గురువారం మండలంలోని వట్టుగుడిపాడులో అక్రమంగా బాణసంచా నిల్వ చేసిన ప్రదేశాల్లో ఎస్సై శుభశేఖర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పిన్నిబోయిన మహేందర్ కుమార్ ఇంటిలో తనిఖీలు నిర్వహించగా ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన బాణసంచాను గుర్తించి స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.


చిన్న పిల్లలతో అల్లాడుతున్న దృశ్యం


వీరమల్లు కాలనీలో ముంపులో నిత్యావసరాలు తీసుకువెళుతున్న యువకుడు

ఇంకా ముంపులోనే...

- పునరావాసం ఖాళీ చేయాలన్న అధికారులు
- రాత్రంతా ముంపునీటిలోనే జాగారం
- తెల్లారాక మళ్లీ పునరావాసం ఏర్పాటు చేసిన వైనం

ఆకివీడు : చినకాపవరం డ్రైయిన్ వరద ఉధృతికి ఆకివీడు సమతానగర్‌లోని వీరమల్లు కాలనీ పూర్తిగా నీట మునిగింది. నెల రోజులుగా కాలనీలోని చెంచుకులస్తులకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావాసం కల్పించారు. అయితే ముంపు నీరు ఇంకా వీడకుండానే వారినే పునరావాస కేంద్రం నుంచి ఇళ్లకు వెళ్లమనడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. ఐదడుగుల నీటినుంచి ప్రస్తుతం మూడున్నర అడుగుల ముంపు నీరు కాలనీలో నిలబడి ఉంది. అయితే కాలనీవాసుల్ని పునరావాస కేంద్రం నుంచి బుధవారం తమ ఇళ్లకు వెళ్లిపోవాలని అధికారులు ఆదేశించడంతో పిల్లలు, వృద్ధులతో పాటు కాలనీవాసులంతా ఆ ప్రాంతం నుంచి ముంపునీటిలో నడుచుకుంటూ తమ ఇళ్లకు వెళ్లారు. రాత్రంతా ముంపునీటిలోనే జాగారం చేశారు. గురువారం తెల్లవారుజామున తమ గోడును స్థానిక సీపీఎం నాయకులకు విలపించుకోవడంతో అధికారులు చెంచుల్ని మళ్లీ పునరావాస కేంద్రంకు తరలించారు. కాలనీలోని తమ ఇళ్లపూర్తిగా దెబ్బతిన్నాయని, మట్టి గోడలు, టార్పాలిన్, దడులు కొట్టుకుపోయాయని విలపిస్తున్నారు. తమను పునరావాస కేంద్రంకు తరలించినా, మాకు ఉన్న కొద్దిపాటి వంటసామాన్లు, మంచాలు, దుప్పట్లు, దుస్తులు, ఇతర సామాన్లన్నీ నీటిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వారు మొరపెట్టుకుంటున్నారు.

అపారిశుద్ధ్యంతో హైస్కూల్

పునారావాస కేంద్రమైన హైస్కూల్ ప్రాంగణం అపారిశుద్ధ్యంతో నిండిపోయిందని హైస్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రం వద్ద పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే చేయడంతో విద్యార్థులకు జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పునరావాస కేంద్రాన్ని మరి కొన్నిరోజులు ఇక్కడే ఉంచితే విద్యార్థుల సంఖ్య మరింత పడిపోయే ప్రమాదం ఉందని, హాజరైన విద్యార్థులు సైతం రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారికి, డీవైఈఓ, ఎంఈఓలకు లిఖిత పూర్వకంగా తెలియజేశామని చెబుతున్నారు. పాఠశాలకు సెలవులు ప్రకటించాలని, లేకుంటే పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.


వృద్ధురాల్ని ముంపు నీటిలోనే ఇంటికి తీసుకువెళుతూ..


నేటికీ ముంపులోనే నానుతున్న సమతానగర్‌లోని వీరమల్లు కాలనీ


స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రానికి చేరుకున్న చెంచులు

ముగిసిన కొబ్బరి ఉత్పత్తులపై శిక్షణ


శిక్షణ ముగించుకొని పత్రం అందుకుంటున్న శాస్త్రవేత్త

తాడేపల్లిగూడెం : కొబ్బరి అభివృద్ధి బోర్డు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో వెంకట్రామన్నగూడెంలో కొబ్బరి ఉత్పత్తులపై మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. 23 కృషి విజ్ఞాన కేంద్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు శిక్షణలో పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో అతిథిగా పాల్గొన్న ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కేవీకే స్థాయిలో నూతన సాంకేతిక విధానాలను, నైపుణ్య కార్యక్రమాలను అమలుచేయాలన్నారు. కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని వ్యాపార సరళిలో చేసి మార్కెటింగ్‌ను అందిపుచ్చుకోవడానికి అవసరమయ్యే శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై కృష్ణా జిల్లాలోని మల్లవల్లి పారిశ్రామిక జోన్‌లో ఉన్న వేపూరి ఆగ్రో ప్రొడక్ట్స్ గురించి శిక్షణ నిచ్చారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఈ తరహా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు అధికారులు వెల్లడించారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.దీప్తి, ప్రసాదరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సీడీబికి చెందిన ఎం.కిరణ్‌కుమార్, శిక్షకులు డాక్టర్ అనిత, సోనూ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

దొంగనోట్ల ముఠా అరెస్ట్

జంగారెడ్డిగూడెం : దొంగనోట్ల ముఠా సభ్యులు ఐదుగురిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పోలవరానికి చెందిన పుసుపులేటి సురేంద్ర కన్నాపురంలో మొబైల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఒక మహిళ ద్వారా నకిలీ కరెన్సీ నోట్లు ముఠా సభ్యుడి ఫోన్ నెంబర్‌ను సురేంద్ర తీసుకుని అతనితో మాట్లాడాడు. మూడు లక్షలు అసలు కరెన్సీ నోట్లకు రూ.10 లక్షల నకిలీ కరెన్సీ ఇస్తామని ముఠా సభ్యుడు నమ్మించాడు. దీంతో సురేంద్ర, అతని స్నేహితుడు కలిసి రూ.2.86లక్షలు అసలు కరెన్సీ నోట్లు తీసుకుని మొదట వారు చెప్పినట్లు తాడువాయి వెళ్లగా, అక్కడ నుంచి ఎ.పోలవరం గ్రామానికి రమ్మన్నారు. అక్కడ ముఠా సభ్యులు సురేంద్ర వద్ద ఉన్న రూ. 2.86 లక్షలు తీసుకుని పారిపోయారు. దీనిపై అప్పట్లో జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ సమయంలో నిందితుడు ఉపయోగించిన ఒక కారును సీజ్‌చేశారు. కాగా అప్పటి నుంచి దొంగనోట్ల ముఠా సభ్యులు పరారీలో ఉన్నారు. డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ముఠా సభ్యుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సీఐ వి.కృష్ణబాబు ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్ తమ సిబ్బందితో కలిసి గాలింపు నిర్వహించారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ముఠా సభ్యులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి అసలు కరెన్సీ నోట్లు రూ.40 వేలు, నకిలీ కరెన్సీ రూ.2.50 లక్షలు, ఒక కారు, ఒక మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో జంగారెడ్డిగూడెంలోని ఉప్పలమెట్టకు చెందిన బర్రే సుధీర్, పేరంపేటకు చెందిన ఏలేటి చంద్రశేఖర్, వేగవరానికి చెందిన ఓగిరాల బాలు, టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడానికి చెందిన చిట్ల నాగరాజు, నెరుసు గంగాధర్‌లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ చెప్పారు. కాగా, ముఠాసభ్యులు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. దొంగనోట్ల ముఠాను అరెస్టు చేసిన సీఐ వి.కృష్ణబాబును, ఎస్సై షేక్ జబీర్, హెచ్‌సీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్ చవల సత్యనారాయణ, ఉప్పులూరి రవికుమార్‌ను డీఎస్పీ అభినందించారు.


దొంగనోట్ల ముఠా కార్యకలాపాలను వెల్లడిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర

ఆటో చోరీపై ఫిర్యాదు

భీమవరం: ఆటో చోరీపై భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భగత్‌సింగ్ వీధికి చెందిన పి వెంకటరాఘవరావు ఈనెల 8వ తేదీ రాత్రి తన ఇంటివద్ద ఆటో పార్కింగ్ చేశాడు. తరువాత రోజు ఉదయం చూసేసరికి ఆటో కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ చెప్పారు.

భగ్గుమన్న కూటమి కుంపటి

- అన్న క్యాంటీన్ వేదికగా బయటపడిన విభేదాలు
- ఫ్లెక్సీల్లో ఫొటోల కోసం కుమ్ములాటలు
- ఎట్టకేలకు రెండున్నరగంటలు ఆలస్యంగా ప్రారంభం
- భోజనాలు చేయకుండానే వెనుదిరిగిన జనం


తమ నేతల ఫ్లెక్సీలు పెట్టలేదంటూ అన్న క్యాంటీన్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు రామ్మోహన్‌నాయుడు, రామరాజు వర్గీయులు

నరసాపురం: నరసాపురంలో రెండవ విడత అన్న క్యాంటీన్ల ప్రారంభం వేదికగా టీడీపీ నేతల మధ్య ఆధిపత్య విభేదాలు భగ్గుమన్నాయి. తమనేత ఫ్లెక్సీ పెట్టలేదంటే, తమ నేత ఫ్లెక్సీ పెట్టలేదంటూ కూటమి నేతలు క్యాంటీన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనను దిగారు. దీంతో క్యాంటీన్ ప్రాంగణం రణరంగంగా మారింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం 6 గంటలకు నరసాపురం స్టీమర్‌రోడ్డులో అన్న క్యాంటీన్ ప్రారంభం ఏర్పాటు చేశారు. జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రారంభించాలి. అయితే క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్‌ఆర్‌ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు ఫొటోలు లేవని ఇరునేతల వర్గీయులు గొడవకు దిగారు. క్యాంటీన్ ప్రారంభించడానికి వీలు లేదంటూ ఎదురుగా ఉన్న రోడ్డుపై బైఠాయించారు. జనసేన నేతలు టీడీపీ నాయకులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయకర్ ప్రారంభానికి రాకుండా పార్టీ కార్యాలయంలోనే ఉండిపోయారు. ఈలోపు రామరాజు, కొవ్వలి నాయుడు ఫ్లెక్సీలు తీసుకొచ్చి పెట్టారు.


క్యాంటీన్ వద్ద కేవలం ఎమ్మెల్యే నాయకర్ ఫొటోతో మాత్రమే ఉన్న ఫ్లెక్సీ

ఫ్లెక్సీలు తీసుకొచ్చినా సద్దుమణగలేదు

ఇద్దరు నేతల ఫ్లెక్సీలు తీసుకొచ్చి పెట్టినా కూడా గొడవ సర్దుమణగలేదు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, మాజీమంత్రి, జనసేన పేత కొత్తపల్లి సుబ్బారాయుడు ఫొటోలు కూడా లేవనే వాదనను కొందరు తెరమీదకు తెచ్చారు. ఈలోపు బీజేపీ నాయకులు కూడా కొందరు జతకలసి ప్రధాని మోదీ ఫ్లెక్సీలు కూడా లేవన్నారు. క్యాంటీన్ ఎదుట ఎన్టీఆర్, చంద్రబాబు ఫొటోలు పెద్దవిపెట్టి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటో చిన్నది పెట్టారని జనసేన శ్రేణులు గొంతుకలిపాయి. దీంతో మొత్తం కార్యక్రమం రసాభాసగా మారింది. చివరికి శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ కలుగుజేసుకుని ఎమ్మెల్యే నాయకర్, పొత్తూరి రామరాజును రాత్రి 8.30 గంటలకు వెంటపెట్టుకుని తీసుకొచ్చి రెండున్నర గంటల ఆలస్యంగా క్యాంటీన్‌ను తూతూమంత్రంగా ప్రారంభించారు. అయితే అప్పటికే భోజనాలు చేద్దామని వచ్చిన జనం నిరాశగా వెనుతిరిగారు. ఊరిలోనే ఉన్న మరోనేత కొవ్వలి యతిరాజరామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మాత్రం హాజరు కాలేదు. బీజేపీ నేతలు కూడా జారుకున్నారు. నరసాపురం కూటమి నేతల మధ్య నివురుగప్పిన నిప్పుగా ఉన్న ఆధిపత్య విభేదాలు ముందుముందు ఎక్కడికి దారితీస్తాయోనని చర్చించుకుంటున్నారు.

ప్రొటోకాల్ నిబంధనలు తూట్లు పొడిచేలా..

క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని ఫ్లెక్సీలను మున్సిపాలిటీ ఏర్పాటు చేసింది. అయితే వైఎస్సార్ సీపీ వాళ్ల ఫొటోలు ఎందుకు పెట్టారని కూటమి నాయకులు వాళ్ల ఫ్లెక్సీలు ధ్వంసం చేశారు.

ఉత్సాహంగా అండర్ 19 స్కూల్ గేమ్స్ పోటీలు


జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ పోటీలలో విజేతలతో నిర్వాహకులు

తణుకు టౌన్ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 19 బాల బాలికల క్రీడా ఎంపిక పోటీలు గురువారం తణుకులో ఉత్సాహంగా జరిగాయి. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలను కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు ప్రారంభించారు. బాల బాలికలకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, యోగా, త్రోబాల్, చదరంగం, టెన్నీకాయిట్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈపోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి 250 విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే జయరాజు తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే అండర్ 19 స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ పోటీలలో జిల్లా జట్టులో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ కార్యదర్శి చిట్టూరి రీనాసాయి, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్స్ యూ లక్ష్మీసుందరి బాయి, బీహెచ్ హిమబిందు, వీవీవీ సత్యనారాయణరెడ్డి, పీడీలు ఎం.శ్రీనివాస్, ఎం.రత్నకుమారి, జీఎంఎస్ కుమార్, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌లో మంటలు

వీరవాసరం: వీరవాసరంలోని పాత సినిమా హాలు గురువారం అగ్నికి ఆహుతి అయ్యింది. గత కొంతకాలంగా థియేటర్‌ను మూసివేశారు. తలుపులు కిటికీలు అన్నీ మూసి ఉన్న థియేటర్‌లో మంటలు చెలరేగడంతో థియేటర్‌లోని కుర్చీలు బెంచీలు ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.


థియేటర్‌లో అంటుకున్న మంటలు

ఉల్లిపాయల వ్యాపారి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం అర్బన్ : అప్పుల బాధ భరించలేక ఉల్లిపాయల వ్యాపారి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెం చోటు చేసుకుంది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి ప్రాంతానికి చెందిన తమ్మాబత్తుల రాము (52) తాడేపల్లిగూడెంలో ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యాపార అవసరాలకు అప్పులు చేయగా వ్యాపారం నష్ట రావడంతో అప్పులు తీర్చలేకపోయాడు. బుధవారం రాత్రి పట్టణంలోని ఓ లాడ్జిలో రూము అద్దెకు తీసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం సాయంత్రం వరకు రూము తలుపులు తెరవక పోవడంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో వెళ్లి రూము తలుపులు బలవంతంగా తెరిచి ఫ్యాన్‌కు వేలాడుతన్న రాము మృతదేహాన్ని కిందకు దించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా రైస్ మిల్లర్స్ రూ.కోటి విరాళం అందజేత

పాలకొల్లు అర్బన్: విజయవాడ వరద బాధితులకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.కోటి చెక్కును గురువారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అందజేసింది. వరద బాధితులకు 70వేల బిర్యానీ ప్యాకెట్లు, అలాగే 25 కిలోల బియ్యం బస్తాలు 50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో పాటు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ శ్రీరామరాజు, కార్యదర్శి కొత్త వెంకట శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు చవ్వాకుల నర్సింహరావు, కొత్తపల్లి వెంకట సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శిలు పేరూరి వీఎస్ఎన్ రాధాకృష్ణ, అనంతపల్లి ఫణి, కోశాధికారి పెరుమాళ్ల వెంకట హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు విరాళం అందజేస్తున్న జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

దెందులూరు: జాతీయ రహదారిపై లారీ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. బెంగుళూరు నుంచి కోల్‌కత్తా వెళ్తున్న అల్లం లోడు లారీ ఏలూరు జాతీయ రహదారిపై ఆశ్రం - సోమవరప్పాడు మధ్య గురువారం రాత్రి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పశ్చిమబెంగాల్‌లోని వర్ధమాన్ గ్రామానికి చెందిన సుమిత్ మజ్జి లారీ డ్రైవర్ మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆగని దాడులు.. దౌర్జన్యాలు

అర్ధరాత్రి రాయన్నపాలెంలో బీభత్సం


గడ్డివాము దగ్ధమైన దృశ్యం

పెదవేగి : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు దౌర్జన్యాలు మాత్రం నేటికి ఆగలేదు. పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త పొన్నూరు సుబ్రహ్మణ్యంకు చెందిన గేదెల పాక, వరిగడ్డి వామును గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసి బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో టన్నున్నర ఐరన్ మొక్కజొన్న చిల్లర్, రెండు ఫ్యాన్లు, రెండు నిమ్మకాయ బస్తాలు, రెండు మందు బస్తాలు, ఒక ఉప్పు కట్ట , ఒక తౌడు డ్రమ్ము, ఒక మిక్సర్ డ్రమ్ము, ట్రాక్టర్ చక్రాలు దగ్ధమయ్యాయి. తమను అంతమొందించాలని అర్ధరాత్రి వచ్చి ఇలా చేశారని పొన్నూరు సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి వివాదాలకు వెళ్లని పొన్నూరి సుబ్రహ్మణ్యంకు ఇలాంటి నష్టం కలిగించడంపై గౌడ సంఘీయులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

పాతూరులో భారీ అన్నసమారాధన


పాతూరులో అన్న సమారాధనను ప్రారంభించిన పాతూరు యూత్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా గురువారం పాతూరు వినాయక గుడి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు. పాతూరు యూత్ సభ్యులు మాట్లాడుతూ 40 సంవత్సరాలు నుంచి వినాయక ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత ఆలయంలో గణపతి స్వామికి విశేషపూజలు జరిగాయి.

ఘనంగా అంతర్జాతీయ బధిరుల దినోత్సవం



భవిత సెంటర్‌లో బధిరుల దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో గురువారం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం వేడుకలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి, పెన్సిల్ బాక్సులు, పలకలు, బిస్కెట్స్, చాక్లెట్స్ అందజేశారు. మానవత పట్టణ అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగుల విద్యార్థుల విద్యకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. జే.రాజేంద్ర, భవిత ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య, చంద్రకుమారి, మానవత సభ్యులు ఆంజనేయ స్వామి, పాఠశాల హెచ్ఎం జ్యోతి, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభమైన స్కూల్ గేమ్స్ పోటీలు


పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడాపోటీలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెంటపాడు బేసిక్‌స్కూల్లో ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా తదితర పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల వ్యాయామ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. కూటమి నాయకులు దాసరి అప్పన్న, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కిలపర్తి వెంకటరావు పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం


వీఎస్‌వీ ప్రసాద్

తణుకు: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం లభించింది. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారకరామారావుపై తెలుగు జాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే అంశంపై ఈనెల 4న నిర్వహించిన ఈ పోటీల్లో పునరావృతం కాని మహాయుగం అనే శీర్షికతో ప్రసాద్ రచించిన కవితకు పురస్కారం లభించినట్లు చెప్పారు.

శ్రీవాసవిలో భారీ జాబ్ మేళా


శ్రీవాసవిలో భారీ జాబ్ మేళాలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో గురువారం భారీ జాబ్ మేళాను నిర్వహించారు. ఇసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రెజెంటేటివ్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్ అండ్ హెల్పర్, ఇండో ఎం.ఐ.ఎం, ఇంజి, డీఎస్‌సీ, అండ్ హోండాయ్‌మోబీస్ కంపెనీలలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో 23 మంది ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత మరో యాభై మందికి త్వరలో నియామక పత్రాలు ఇస్తామని కంపెనీ తరుపు నిర్వాహకులు వెల్లడించారు. ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల కోసం త్వరలో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఇదేం ఎండ.. బాబోయ్!

- మే నెలను తలపిస్తున్న సెప్టెంబరు
- ఉదయం నుంచే సుర్రుమంటున్న సూరీడు
- ఉక్కపోతతో బెంబేలెత్తిపోతున్న జనం


తణుకులో సాయంత్రమైనా సుర్రుమంటున్న సూరీడు

తణుకు: సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలలు వచ్చాయంటే చాలు ఎడతెరిపి లేని వర్షాలు.. ముసురు ఇలా వాతావరణం చల్లబడుతుంది. అయితే ఈ ఏడాది మాత్రం ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సైతం ఎండ వేడిమి అల్లాడిస్తోంది. ప్రస్తుతం తణుకు నియోజకవర్గంలో వాతావరణం మే నెల ఎండలను తలపిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఏటా జూలై నుంచి ఎండలు తగ్గుముఖం పడతాయి. అయితే ఇక్కడ మాత్రం వేసవిని తలపిస్తూ గత రెండు నెలలుగా ఎండలు మండుతున్నాయి. సాధారణంగా సెప్టెంబరులో తణుకులో గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలుగా ఉంటాయి. ప్రస్తుతం 32 నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గురువారం తణుకులో 34 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు ఇళ్లల్లో ఫ్యాన్లు, ఏసీలు నిరంతరం తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో జన సంచారం కూడా మధ్యాహ్నం పూట అస్సలు కనిపించడం లేదు.

వర్షాభావ పరిస్థితులే కారణమా?

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండ తీవ్రత పెరిగినట్లు తెలుస్తోంది. ఈ మధ్య వర్షాలు కురిసినా ఎండలు మాత్రం తగ్గలేదు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఎండలను సెప్టెంబరులో చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఉక్కబోత కారణంగా దుస్తులన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. ప్రస్తుతం తణుకు నియోజకవర్గంలో వరినాట్లు పూర్తయ్యాయి. కూలీ పనులకు వచ్చే కూలీలు సైతం ఎండల కారణంగా పెద్దగా పనులకు రావడం లేదు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలకు సైతం నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం ఈ నెలలో భారీగా పెరిగింది. ఉపాధి పనులు సైతం తగ్గుముఖం పట్టాయి.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలి



అత్తిలి: బల్లిపాడులో స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఇంటిలోని చెత్తను రోడ్లపై వేయరాదని, పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని నాగు, ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వలో స్వచ్ఛతా హి సేవా అవగాహనా ర్యాలీ

తణుకు టౌన్: పారిశుద్ధ్యం, పరిశరాల పరిశుభ్రత కోరుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా తణుకు మండలం దువ్వ గ్రామంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గురువారం దువ్వ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని నాయకులు, పంచాయితీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, పరిసరాల పరిశుభ్రత కోరుతూ గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని పలు కూడళ్ల, పాఠశాలల విద్యార్థులతో పరిశుభ్రతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి (అడ్డా బాబు), గ్రామ కార్యదర్శి భాస్కర్, మండల బీజేపీ అధ్యక్షుడు దాసరి బాబి, జనసేన పార్టీ అధ్యక్షుడు చిక్కాల వేణు, శ్రీరాముల చిన్ని, అరిగెల బాబి, పోతుల సత్యనారాయణ పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ చంద్రిక, చిత్రంలో ఎంపీడీవో విశ్వనాథ్


తణుకు టౌన్: దువ్వ గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

బల్లిపాడు పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ

అత్తిలి: స్వచ్ఛతాహి సేవా మాసోత్సావాల్లో భాగంగా అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణలో శ్రమదానం చేసి ఆవరణను శుభ్రం చేశారు. సచివాలయ గ్రామ సెక్రటరీ పి.మనోజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంపీటీసీ పి.నాగేశ్వరరావు, కూటమి నాయకులు ఆకుల రామచంద్రరావు, కసిరెడ్డి అప్పారావు, గారపాటి అశోక్, బండి సోమేంద్ర, తలారి మణికుమార్, ప్రగడ శివన్నారాయణ, సింగంశెట్టి కాశీకృష్ణ, వడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: తణుకు, ఇరగవరం, వేల్పూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని రాష్ట్రపతి రోడ్డు బీపీఎల్ షోరూం నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు, తణుకు మండలం వేల్పూరు, కొమరవరం, మహాలక్ష్మిచెరువు, యర్రాయిచెరువు, వీరభద్రపురం, రేలంగి, ఇరగవరం మండలంలో పేకేరు, ఏలేటిపాడు, కాకిలేరు, రాపాక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్‌టౌన్ పరిధిలోని అన్ని ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట, టిడ్కో, పెదతాడేపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూ టౌన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ మరమ్మతులు నిమిత్తం టూ టౌన్‌లో 11కేవీ మార్కెట్ ఫీడర్‌కు సంబంధించి ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. తాళ్లముదునూరుపాడు పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గణేష్ నిమజ్జనంలో ఘర్షణ, ఇద్దరికి గాయాలు

తణుకు: మండలంలోని మండపాక గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జనంలో జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తణుకు రూరల్ ఏఎస్ఐ అంజిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పైబోయిన చెన్నకేశవ, చెన్నంశెట్టి సతీష్‌లు నిమజ్జనం పూర్తయ్యాక ఇంటి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మారిశెట్టి వెంకటేశ్వరరావు, మరికొందరు కలిసి వారిపై దాడి చేసి గాయపరిచారు. వీరిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అంజిబాబు తెలిపారు.

కొమ్ముగూడెం సొసైటీ మహాజన సభ

తాడేపల్లిగూడెంరూరల్: మండలంలోని కొమ్ముగూడెం విశాల సహకార పరపతి సంఘం ఆవరణలో గురువారం మహాజన సభ పర్సన్ ఇన్‌చార్జ్ ఇ.లక్ష్మీకాంతం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ రిపోర్టును, వార్షిక నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. 2023–24 సంవత్సరానికి గాను ఒక కోటి 14లక్షల 65వేల 94 రూపాయలు నికర లాభం వచ్చిందని పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంతం తెలిపారు. సభ్యుల అప్పులు త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. సీఈవో సీహెచ్ఎస్ వీ.కృష్ణ శర్మ, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయంగా మేకల పెంపకం


మేకలతో లబ్ధిదారులు

తాడేపల్లిగూడెం: గిరిజన రైతులు జీవనోపాధి మెరుగుపర్చుకోడానికి శాస్త్రీయంగా మేకల పెంపకాన్ని చేపట్టాలని వెంకట్రామన్నగూడెం కెవికెలో బుట్టాయిగూడెం మండలానికి చెందిన గిరిజన రైతులకు ఇచ్చిన శిక్షణలో గురువారం శాస్త్రవేత్తలు వివరించారు. మేకల పెంపకం పద్ధతులను , అవసరమైన నైపుణ్యం సమకూర్చుకోవడం ప్రాథమిక లక్ష్యమని అధికారులు తెలిపారు. మేకల్లో నులి పురుగుల నివారణ , టీకాలు వేయడం, ప్రాముఖ్యత గురించి డాక్టర్ నాగరాజకుమారి వివరించారు.పోషకాహారం ,మేత నిర్వహణ, వివిధ దశలలో మేకల పోషక అవసరాలు గురించి ఆమె తెలియచేశారు. డాక్టర్ ప్రసాదరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు గోవిందరాజులు, కెవికె సమన్వయకర్త ఇ.కరుణశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు


చెస్ పోటీలలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ):బాల బాలికలు ఆటల పోటీలలో ప్రతిభ చూపి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో క్రీడాకారులుగా రాణించాలని, వారికి ఉజ్వల భవిష్యత్తు తప్పక ఉంటుందని ఎంఈఓలు వి.హనుమ, పీఎంకే జ్యోతిలు పేర్కొన్నారు. 68వ మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడా పోటీల ఎంపికలను గురువారం ఎంఈఓలు ప్రారంభించారు. మొదటి రోజు మండల స్థాయి సెలక్షన్స్‌లో 35 ఉన్నత పాఠశాలల నుంచి అండర్ 14, అండర్ 17 విభాగాలలో వాలీబాల్, చెస్ పోటీలు కోసం 340 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరైయారు. పోటీలలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్ఎం రామకృష్ణ, మండల పీడీలు కోఆర్డినేటర్ ఎ.ఈశ్వర్, చింతకాయల సత్యనారాయణ, ఎ.నాగార్జున, కె.అమరనాథ్, కె.వెంకటేశ్వరరావు, కె.శ్యామ్‌బాబు, బి.ఉమామహేశ్వరి, కె.సుభద్ర, ఆర్.శివలీల పర్యవేక్షించారు.

వరద బాధితులకు అండగా....


జిల్లా కలెక్టర్ నాగరాణికి చెక్కు అందజేస్తున్న ఆర్‌జేడీ నాగమణి, డీవైఈవో మురళి సత్యనారాయణ

తణుకు అర్బన్: విజయవాడ వరద ముంపు బాధితుల అండగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 1,37, 010లు చెక్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందచేసినట్లు డీవైఈవో డి.మురళి సత్యనారాయణ తెలిపారు. కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) జి.నాగమణి ఆధ్వర్యంలో చెక్కును అందచేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంలు అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫాం డ్రెస్సులు అందజేశారు. మానవత అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ కోరిక మేరకు ఇతర వసరులు ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఉపాధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ఆఫీస్ రూంకు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యెగ్గిన శరత్ పాల్గొన్నారు.

తెలంగాణ గణనాథుడి నిమజ్జనం


తణుకులో నిమజ్జనానికి వెళ్తున్న భారీ గణనాథుడు

తణుకు అర్బన్ : వినాయకచవితి ముగింపు మహోత్సవాల్లో భాగంగా తణుకు ఆపిల్ ఆస్పత్రి సమీపంలో శ్రీబాల గణపతి యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుడిని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం నిమజ్జనానికి ముస్తాబుచేసి ప్రత్యేక వాహనంపై ఎక్కించారు. తెలంగాణలోని ధూల్‌పేట నుంచి తీసుకువచ్చిన విగ్రహం కావడంతో తణుకు నలుమూలల నుంచి స్వామివారిని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మేళతాలాలు, బ్యాండు మేళం, బాణాసంచా కాల్పులమధ్య స్వామివారిని రైల్వేస్టేషన్ మీదుగా ఆర్వోబీ, పైడిపర్రు, జాతీయ రహదారి, వంగవీటి మోహనరంగా వీధి నుంచి రాష్ట్రపతి రోడ్డులోకి వచ్చిన గణనాథుడు నరేంద్రసెంటర్ మీదుగా వేల్పూరు రోడ్డు నుంచి ఆంధ్రా సుగర్స్ ప్రాంతంలోని గోస్తనీ కాలువలో క్రేన్ సాయంతో నిమజ్జనం చేశారు. యువకులు, భక్తులు, కమిటీసభ్యులు నిమజ్జన ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోద కుమారి


బల్లిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ఎంబీఎస్ ప్రమోదకుమారి చెప్పారు. పోషకాహార మహోత్సవాలలో భాగంగా గురువారం తణుకు పట్టణం సజ్జాపురం 27వ వార్డులలో గల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్త హీనత లేకుండా కాపాడుకోవచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అరుణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు జీ రాధ జయలక్ష్మీ, పీలక్ష్మి, ఆర్‌పీ కృష్ణవేణి, ఆశా వర్కర్లు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

అత్తిలి: కిశోర బాలికలు తప్పనిసరిగా నిత్యం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం.శ్రీదేవి అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు ఉన్నత పాఠశాలలో గురువారం పోషకాహార మాసోత్సవ వేడుకల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం లోపంతో ఎన్నో అనారోగ్యసమస్యలు తలెత్తు తున్నాయని చెప్పారు. అనంతరం బాలికలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం జి.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పి.రాంబాబు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.స్వప్నశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి దిగుబడులు సాధించాలి


విత్తనాల బస్తాలతో రైతులు

తాడేపల్లిగూడెం: శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలు వాడి రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు కోరారు. గురువారం వెంకట్రామన్నగూడెంలోని ఐసీఏఆర్ , అటారి సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక ప్రథమశ్రేణి ప్రదర్శనలు, నూనె గింజల వాడకం పై అవగాహన కార్యక్రమం జరిగింది. విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు మాట్లాడుతూ రైతులు వేరుశనగ రకాలైన టీసీజీఎస్ 1694 ప్రాధాన్యత గురించి వివరించారు. రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే అధికారుల సలహాలు.సూచనలు విధిగా పాటించాలని కెవికె సమన్వయకర్త ఇ.కరుణశ్రీ కోరారు. యాజమాన్య పద్ధతుల పై కెవికె శాస్త్రవేత్త రాఘవేంద్రరెడ్డి తెలిపారు. గిరిజన రైతులకు 16క్వింటాళ్ల విత్తనాలను అందచేశారు.

తణుకు సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి


తణుకు సబ్‌జైలులో రిమాండ్ ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రత్నప్రసాద్

తణుకు అర్బన్: సబ్‌జైలులో రిమాండ్ ముద్దాయిలందరికీ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలన్నీ పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఏలూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా జడ్జి చింతలపూడి పురుషోత్తమరావు ఆదేశాల మేరకు న్యాయమూర్తి కె.రత్నప్రసాద్ గురువారం తణుకు సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ముద్దాయిలకు అందుబాటులో ఉన్న వసతులతో పాటు ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. కేసులకు సంబంధించి ప్రతి ఒక్క ముద్దాయి న్యాయవాదిని కలిగి ఉండాలని, న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనిపరిస్థితుల్లో న్యాయస్థానం ఉచిత న్యాయవాదిని ఏర్పాటుచేసే సౌకర్యం ఉందన్నారు. ముద్దాయిలకు శిక్షపడిన సందర్భాల్లో సైతం అప్పీల్ చేసుకునేందుకు కూడా న్యాయస్థానం ఉచితంగా న్యాయవాదిని సమకూరుస్తుందని చెప్పారు. కేసుల పురోగతితోపాటు న్యాయసలహాలు, సహాయం కోసం జైలులో ప్రత్యేక క్లినిక్ ఉందని, ఆ క్లినిక్‌లో ఒక ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వాలంటరీ ఉంటారని చెప్పారు. వారంలో రెండురోజులు ఈ క్లినిక్ న్యాయవాదులు జైలులో అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు, జైలు విజిటింగ్ న్యాయవాది చింతపల్లి నాగేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ సాధనాల వెంకటగిరి, న్యాయవాదులు తిర్రే సత్యనారాయణరాజు, కాకుల విజయ, కేఆర్‌వీఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాయామంతో మధుమేహం నియంత్రణ


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: వ్యాయామ చేస్తూ జీవన విధానం మార్చుకుంటే షుగర్ వ్యాధి అదుపులో ఉంటుందని ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు ఎస్‌వీ స్వామి అన్నారు. గురువారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్, ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి రోగులకు షుగర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ షుగర్ రావడానికి అనేకకారణాలు ఉన్నాయని, వ్యాయామం చేయడం వలన ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు పాల్గొన్నారు.